క్లుప్తంగా

ఆన్‌లైన్‌ బెట్టింగ్‌ యాప్‌లపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : ప్రభుత్వం ఆన్‌లైన్‌ యాప్‌లైన ఆన్‌లైన్‌ బెట్టింగ్‌, జీవీ ఫుట్‌బాల్‌, లివింగ్‌ యాప్‌లపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్‌ నగర కన్వీనర్‌ మైనుద్దీన్‌ అన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెట్టింగ్‌ యాప్స్‌ వల్ల లక్షల మంది యువత నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. లివింగ్‌ యాప్‌ పేరుతో యువతను ఆకర్షిస్తూ వీడియో కాల్స్‌ రికార్డ్‌ చేసుకొని బ్లాక్‌ మెయిల్‌ చేస్తూ రూ. లక్షలు దోపిడీ చేస్తున్నారన్నారు. ఇటువంటి యాప్‌లపై ప్రభుత్వం తగినచర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్‌ నాయకులు నాగార్జున, మహబూబ్‌ బాషా తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్‌ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు, చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. మిస్బా మూవీ క్రియేషన్స్‌ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ప్రాచుర్యం పొందిన సినీ గీతాలకు చిన్నారులు చేసిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప నగరం రిమ్స్‌ పోలీసుస్టేషన్‌ పరిధిలో శివానందపురం బొరుగుల ఫ్యాక్టరీ వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 39,030 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జూదరులు..

వల్లూరు : మండలంలోని అంబవరం గ్రామ సమీపంలోని పొలాల్లో జూదం ఆడుతున్న నలుగురిని ఆదివారం అరెస్ట్‌ చేసి వారి వద్ద నుంచి రూ.8,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పెద్దఓబన్న తెలిపారు.

వర్షం కోసం ప్రార్థనలు



ప్రార్థనలు నిర్వహిస్తున్న విశ్వాసులు

కడప కల్చరల్‌ : ప్రభువా.. వర్షం కురిపించవా.. అంటూ పలువురు విశ్వాసులు దైవాన్ని ప్రార్థించారు. ఆదివారం స్థానిక కృపా కాలనీలోని న్యూ నేటివ్‌ కృపా మినిస్ట్రీస్‌లో పాస్టర్‌ పి.మహేష్‌, సిస్టర్‌ శాంతమ్మల ఆధ్వర్యంలో వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్‌ మహేష్‌ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎండలు అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సకాలంలో వర్షాలు కురవక అన్ని విధాలా ప్రజలు కష్టాలు చవిచూస్తున్నారన్నారు. సంవృద్ధిగా వర్షాలు కురిపించాలని, రైతులు పంటలు పండించేందుకు అనువైన వాతావరణం కల్పించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో స్థానికులు రవితేజ, దావీదు, శాంతిరాజు, నరసయ్య, విజయ్‌, లీలావతి, రోజా తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌ఫిల్మ్‌ 'ఉల్ఫ్‌' పోస్టర్‌ ఆవిష్కరణ



'ఉల్ఫ్‌' షార్ట్‌ ఫిల్మ్‌ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దర్శకుడు, నటీనటులు

కడప కార్పొరేషన్‌ : 'ది బీచ్‌ హౌస్‌' ఫేమ్‌ పవన్‌ హీరోగా, అఫ్జల్‌ బాయ్‌ దర్శకత్వంలో రూపొందుతున్న షార్ట్‌ ఫిల్మ్‌ 'ఉల్ఫ్‌' పోస్టర్‌ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం కడప నగరంలో జరిగింది. ప్రముఖ నటుడు, షా ఫిల్మ్స్‌ సంస్థ వ్యవస్థాపకుడు పెద్దపులి భరత్‌ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రిప్లె షూటర్‌ అసోషియేషన్‌ ఆఫ్‌ ఆంధ్రప్రదేశ్‌ జాతీయ క్రీడాకారుడు జాకీర్‌ హుస్సేన్‌, ట్రావెల్స్‌ అధినేత నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ అఫ్జల్‌ బాయ్‌ మాట్లాడుతూ సమాజంలో మేకవన్నె పులులు ఉన్నారని, అలాంటి వ్యక్తుల కథాంశంతో ఈ 'ఉల్ఫ్‌' షార్ట్‌ ఫిల్మ్‌ తీస్తున్నామని చెప్పారు. మనిషికి నైతిక విలువలు ఎంత అవసరమో ఈ ఫిల్మ్‌లో చూపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక బృందం సరోజ, శైలజ, కళాకారులు తాళ్లపల్లె ప్రసాద్‌, జార్జి, వీవీవర్మ, ఇస్మాయిల్‌, సుబ్బు, హరి, సురేంద్ర, సమీర్‌, శివ, నాగముని, నటీనటులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు.

సేవకు సలాం



కుటుంబ పోషణకు ఆసరాగా..



పెన్షన్‌ మంజూరు పత్రాన్ని అందుకుంటున్న ముబారక్‌ కుటుంబ సభ్యులు

కడప నగరం 29వార్డుకు చెందిన షేక్‌ ముబారక్‌ పొట్ట కూటి కోసం చేసే పనిని వదులుకుని ఎప్పుడు పడితే అప్పుడు నాలుగేళ్లపాటు పెన్షన్‌ కోసం కార్యాలయాల చుట్టూ తిరిగాడు. పలువురి అధికారులను పెన్షన్‌ కావాలని అడిగాడు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఇక చేసేదేమీ లేక చివరకు రిక్షా తీసుకుని తొక్కుకుంటూ వచ్చిన డబ్బుతో కుటుంబ జీవనాన్ని సాగించాడు. సచివాలయ వ్యవస్థ వచ్చాక అతడు పెన్షన్‌ కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు పరిశీలించి పెన్షన్‌ మంజూరు చేశారు. ఇప్పుడు ముబారక్‌ రిక్షా కష్టానికి పెన్షన్‌ డబ్బు తోడవడంతో కుటుంబ పోషణకు కొంత ఉపశమనం లభించింది. అతడికి ఇప్పుడు 1వ తేదీ తెల్లారే సరికి తలుపు తట్టి పెన్షన్‌ ఇస్తున్నారు.

– కడప ఎడ్యుకేషన్‌

వలంటీరు కృషి అభినందనీయం



నాకు పెన్షన్‌ మంజూరులో మా వలంటీరు ఆయేషా చేసిన కృషి అభినందనీయం. నాలుగేళ్ల పాటు పెన్షన్‌ కోసం తిరిగి తిరిగి వేసారి పోయిన నాకు మా వలంటీరు ఇంటి వద్దకు వచ్చి పెన్షన్‌కు దరఖాస్తు చేయించింది. అధికారులతో మాట్లాడి పెన్షన్‌ ఇప్పించింది. ఆమెకు రుణపడి ఉంటాను.

- షేక్‌ ముబారక్‌, 29వార్డు, కడప నగరం

వరదలను సైతం లెక్క చేయకుండా..



వరదనీటిలో ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వలంటీరు హేమంత్‌

ఇతడి పేరు హేమంత్‌. కడప నగరంలోని 20వ డివిజన్‌ ప్రకాష్‌ నగర్‌లో వార్డు వలంటీరుగా సేవలందిస్తున్నాడు. 2020లో కడపకు భారీ వరదలు వచ్చాయి. ఆ సమయంలో బుగ్గవంక పరివాహక ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రకాష్‌ నగర్‌ కూడా చాలా వరకూ మునిగిపోయింది. ప్రజలు ఇంటి నుంచి బయటికి వెళ్లాలన్నా, బయటి నుంచి ఇంట్లోకి రావాలన్నా వీలయ్యే పరిస్థితి లేదు. వీధుల నిండా మోకాలి లోతు నీరే. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ రోడ్డు, కాలువ ఉందో తెలియని పరిస్థితి. కానీ హేమంత్‌ వరదలను ఏమాత్రం లెక్క చేయకుండా ప్రతి ఇంటికీ వెళ్లి పింఛను, రేషన్‌ అందజేసి ప్రజల మన్ననలు పొందాడు. కరోనా సమయంలోనూ ఫీవర్‌ సర్వే చేసి, అవసరమైన మందులు అందించాడు.

– కడప కార్పొరేషన్‌

ఆప్యాయంగా పలకరిస్తాడు



మా వలంటీరు హేమంత్‌ ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చిందంటే చాలు తెల్లవారక ముందే ఇళ్ల వద్దకు వచ్చి...నిద్రలేపి అవ్వా, తాతా అంటూ ఆప్యాయంగా పలకరించి పింఛను ఇస్తాడు. వరదలు వచ్చినప్పుడు ఇంటింటికీ ఆహార ప్యాకెట్లు అందించాడు. కరోనా సమయంలోనూ భయకుండా సేవలందించాడు. మా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ మందుల కిట్‌ ఇచ్చాడు.

- సరోజమ్మ, ప్రకాష్‌నగర్‌, కడప నగరం

సొంతింటి కల నేరవేర బోతోంది..

ఎన్నో ఏళ్లుగా సొంత గూడు లేక అద్దె ఇళ్లలో ఇబ్బంది పడ్డ ఓ మహిళకు ఇంటి స్థలం మంజూరు కావడంతో సొంతింటి కల నెరవేరబోతోంది. కడపలోని 29వ వార్డులో నివాసం ఉంటున్న బసీర్‌ ఉన్నీషకు డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇంటి స్థలాన్ని ఇచ్చారు. కానీ అప్పట్లో అమెకు ఆర్థిక స్తోమత లేక ఇంటిని నిర్మించుకోలేక పోయింది. దీంతో అమెకు కేటాయించిన స్థలం వెనక్కు వెళ్లిపోయింది. ఇక సొంతింటి కల నెరవేరదోమోనని ఆందోళన చెందుతున్న బసీర్‌ ఉన్నీషకు నేనున్నానంటూ వైఎస్‌ తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి ఇంటి స్థలం కేటాయించడంతోపాటు ఇంటిని నిర్మించి ఇవ్వనుండటంతో బసీర్‌ ఉన్నీష కల నేరవేర బోతోంది. ప్రస్తుతం ఆమెకు ఇంటి స్థలాన్ని మంజూరు చేశారు. త్వరలో ఇంటిని కూడా మంజూరు చేయనున్నారు. దీంతో బసీర్‌ ఉన్నీష ఏళ్లనాటి కల నెరవేరబోతుండడంతో ఆమె సంతోషం వ్యక్తం చేస్తోంది.

– కడప ఎడ్యుకేషన్‌



బసీర్‌ ఉన్నీషకు ఇంటి పట్టాను అందిస్తున్న వలంటీరు సయ్యద్‌ ముబీన్‌తాజ్‌

వలంటీరు సహకారంతోనే..



నాకు ఇంటిస్థలం ఇప్పించడంతో వలంటీరు సయ్యద్‌ ముబీన్‌తాజ్‌ ఎంతో కృషి చేసింది. నాకు ఇంటి స్థలం కేటాయించే విషయంలో దరఖాస్తు పెట్టించి నిత్యం ఫాలోఅప్‌ చేసి స్థలం వచ్చే వరకు కృషి చేసింది. ఆమె సేవ మరువలేనిది. ఈ రోజు నాకు సొంత ఇంటి కల నెరవేరబోతుందంటే చాలా సంతోషంగా ఉంది.

- బసీర్‌ ఉన్నీష, లబ్ధిదారు, కడప

పండుటాకుల పాలిట పెన్నిధి



పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీరు వెంకట విశ్వనాథ్‌

కడప నగరం పెద్ద దర్గా సమీపంలోని బాలపోలేరమ్మ వీధి, చిన్నబెస్తవీధి, ముత్యాలరామయ్య వీధికి చెందిన వలంటీరు ఎం. వెంకట విశ్వనాథ్‌ పండుటాకుల పాలిట పెన్నిధిలా సేవలందిస్తున్నాడు. 32/1వ సచివాలయం పరిధిలో వార్డు వలంటీరుగా పనిచేస్తున్న ఇతడు ఒకటోతేదీ అయితే చాలు వేకువజామునే అవ్వాతాతల వద్దకు చేరి పింఛను చేతిలో పెడుతున్నాడు.ఆరోగ్యశ్రీ కార్డులు, జగనన్న ఇళ్ల కేటాయింపు తదితర పనులను చక్కగా నిర్వహిస్తున్నాడు. తన పరిధిలోని ఓ వృద్ధురాలు వృద్ధాశ్రమంలో ఉంటే అక్కడికే వెళ్లి పింఛను అందించి సేవలందిస్తున్నాడు.

– వైవీయూ

సొంత మనువడిలా సేవలు..



వలంటీరు వెంకట విశ్వనాథ్‌ ఒకటో తేదీ అయిందంటే చాలు.. ఎంతో ప్రేమగా.. అవ్వా అంటూ సొంత మనువడిలా వచ్చి పింఛను ఇచ్చి మమ్మల్ని సంతోష పెడుతుంటాడు. కేవలం పింఛను డబ్బు ఇవ్వడమే కాకుండా ఆరోగ్యం ఎలా ఉందంటూ వాకబు చేస్తూ తగిన సహాయం చేస్తుంటాడు.

- వసుంధరమ్మ, వృద్ధురాలు, కడప

ఆర్‌డీఎస్‌ఎస్‌ స్కీం ద్వారా విద్యుత్‌ స్తంభాలు, లైన్ల మార్పిడి



విద్యుత్‌ శాఖ కడప డివిజన్‌ ఈఈ నరసింహప్రసాద్‌

కడప కార్పొరేషన్‌ : రివాంప్‌డ్‌ డిస్ట్రిబ్యూషన్‌ సెక్టార్‌ స్కీం(ఆర్‌డీఎస్‌ఎస్‌) స్కీం ద్వారా కడప నగరంలో విద్యుత్‌ స్తంభాలు, విద్యుత్‌లైన్లను మార్పు చేస్తున్నామని ఏపీఎస్‌పీడీసీఎల్‌ కడప డివిజన్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీరు ఎల్‌. నరసింహప్రసాద్‌ అన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన మాట్లాడుతూ ఈ స్కీంలో పాత వైరు, కండక్టర్లు మార్చడం, రోడ్‌ క్రాసింగ్‌ స్తంభాలు మార్చడం వంటివి చేస్తే కేంద్ర ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. కడపలో లోడ్‌ సమస్య ఉన్నచోట ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇదివరకు ఉన్న 100 చ.మి.మీ కండక్టర్‌ స్థానంలో 157 చ.మి.మీ కండక్టర్‌ వేస్తున్నామని చెప్పారు. అప్సర థియేటర్‌ సమీపంలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌ నుంచి ఎల్‌ఐసీ వరకూ, అప్సర నుంచి రామరాజుపల్లె వరకూ, అప్సర నుంచి దేవునికడప వరకూ ఉన్న లైన్లన్నీ మార్చబోతున్నామని చెప్పారు.కడప డివిజన్‌ పరిధిలో కొత్త సబ్‌స్టేషన్లు రాబోతున్నాయని చెప్పారు. నానాపల్లి, మామిళ్లపల్లె, పాత బస్టాండు, మేకల దొడ్డి, దండు హరిజన వాడ, కొత్త గంగిరెడ్డిపల్లె, గొందివల్లె, సాగర్‌ కాలనీ, మహిళా ప్రాంగణం, చలమారెడ్డిపల్లె(టిడ్కో–2), ఎలక్ట్రికల్‌ కాలనీ, లలితాంబ టెంపుల్‌, చెర్లోపల్లి, దుగ్గాయపల్లె, రామనపల్లె, ఆదినిమ్మాయపల్లె, కొలుములపల్లెల్లో కొత్త సబ్‌స్టేషన్లు రానున్నాయని తెలిపారు.

మొక్కలు నాటడం మన భవిత కోసమే



మొక్కలు నాటుతున్న ఎల్‌ఐసీ అధికారులు

కడప కల్చరల్‌ : మొక్కలు నాటడం మన భవిష్యత్తు కోసమేనని కడప ఎల్‌ఐసీ సీనియర్‌ డివిజనల్‌ మేనేజర్‌ కె.గిరిధర్‌ అన్నారు. ఎల్‌ఐసీ కేంద్ర కార్యాలయం ఆదేశం మేరకు డివిజన్‌లోని అన్ని కేంద్రాల్లో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా కడప నగరంలో స్వయంగా మొక్కలు నాటి ఈ కార్యక్రమానికి మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, సామాజిక పాలనాపరమైన కార్యకలాపాల్లో భాగంగా ఎల్‌ఐసీ ప్లాంట్‌–యే–లైఫ్‌ కార్యక్రమానికి పిలుపునిచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్‌ మేనేజర్లు సత్యప్రసాద్‌, సత్య శ్రీనివాస్‌, అధికారులు శ్రీనివాస్‌, పద్మజ, వెంకట కృష్ణ, విజయ్‌కుమార్‌రెడ్డి, యూనియన్‌ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాతికేళ్ల తర్వాత ఒక్కచోట చేరిన స్నేహితులు



కేఎస్‌ఆర్‌ఎం కళాశాలలో కందుల శివానందరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్‌ : కడప నగర శివార్లలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్‌ కళాశాలలో ఆదివారం కళాశాలకు చెందిన 1994–98 బ్యాచ్‌కు చెందిన ఈఈఈ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. దేశ విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులు కూడా కార్యక్రమానికి తరలిరావడంపై కళాశాల మేనేజింగ్‌ డైరెక్టర్‌ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమలో ప్రిన్సిపాల్‌ వీఎస్‌ఎస్‌మూర్తి, అడ్మినిస్టేటివ్‌ మేనేజర్‌ ప్రేమ్‌కుమార్‌, ఈఈఈ విభాధిపతులు ప్రియదర్శిని, అలుమ్ని డీన్‌ కిరణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతో శాశ్వత ఆరోగ్యం



శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

కడప కల్చరల్‌ : శాకాహారం ద్వారా మనిషికి శాశ్వత ఆరోగ్యం లభిస్తుందని కడప పిరమిడ్‌ స్పిరిచ్యువల్‌ సొసైటీ నిర్వాహకుడు జీవీఎస్‌ రెడ్డి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో శాకాహారం మాత్రమే తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆదిత్య కల్యాణమండపం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ శ్రీనగర్‌ కాలనీ చుట్టుపక్కల వీధుల్లో స్థానిక శాకాహార ప్రియులతో కలిసి సాగింది. స్పిరిచ్యువల్‌ సొసైటీ కార్యదర్శి డాక్టర్‌ ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో ధ్యానులు పిరమిడ్‌ మాస్టర్లు ఓబయ్య, గజ్జెల రామసుబ్బారెడ్డి, జీవీఎస్‌ రెడ్డి, మురళి తదితరులతోపాటు స్థానిక ప్రముఖులు, ధ్యానులు ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ పార్టీ ప్రధాన కార్యదర్శి సుందర్రామరాజు

కడప ఎడ్యుకేషన్‌ : ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ పార్టీ ప్రధాన కార్యదర్శి సుందర్రామరాజు అన్నారు. ఆదివారం కడపలోని ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌ శక్తులకు వత్తాసు పలుకుతూ పేద ప్రజల అభివృద్ధిని అడ్డుకుంటోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హయాంలో సామాన్యులు గ్యాస్‌ సిలిండర్‌ను కొనలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఆలిండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్‌, జిల్లా సీనియర్‌ నాయకులు గంగులయ్య, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, పవన్‌కుమార్‌, సునీల్‌కుమార్‌, రామాంజనేయులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : నగర పరిధి 4వ డివిజన్‌లోని పరమేశ్వర హైస్కూల్‌ వెనుక భాగంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని డీహెచ్‌పీఎస్‌ జిల్లా కార్యదర్శి మునెయ్య అన్నారు. ఆదివారం నగరంలోని పరమేశ్వర హైస్కూల్‌ వెనుక చర్చికి వెళ్ళే దారిలో నిలిచిన మురుగునీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కాల్వలను ఆక్రమించడం ద్వారా డ్రైనేజీ నీరంతా రోడ్లపై నిలిచి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. హోమియోపతి కళాశాలకు వెళ్ళే రహదారిలో వర్షపునీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నగరపాలక కమిషనర్‌ స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. డీహెచ్‌పీఎస్‌ నాయకులు రమణ, ప్రసాద్‌, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎన్‌.పాలగిరి గ్రామంలో ప్రతిభ బయోటెక్‌ అధినేత ఇసుకపల్లె రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆర్‌ఎం వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్‌ మల్లికార్జున్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం పరిశోధనా కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మండలంలోని ఒక పల్లెటూరులో అది కరువు ప్రాంతంలో అధునతన పరికరాలతో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సాహసోపేతమైన నిర్ణయమని రాజశేఖర్‌రెడ్డిని వారు అభినందించారు. వ్యవసాయ రంగంలో కొత్త విదానాల గురించి రైతులకు తెలియజేయడంతో పాటు వారికి తరచూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని చూసించారు. శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని వారు అందించే సలహాలు సూచనలు పాటించాలని ఆయన రైతులను కోరారు. వ్యవసాయానికి అవసరమైన వాటిని గ్రామ స్థాయిలోనే అందించడంతో పాటు దానికి సంబంధించిన సలహాలు సూచనలు అందించాలన్న సంకల్పంతో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సంస్థ ఎండీ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిభ బయోటెక్‌ సంస్థను 60 మంది సిబ్బందితో స్థాపించడం జరిగిందని ప్రస్తుతం 7 వందల మందితో ముందుకు సాగుతోందన్నారు. రైతుల పొలాలకు సంబంధించి మట్టి, నీరు పరిశీలించడంతో పాటు ఆయా భూములకు సరిపడే విధంగా సలహాలు అందిస్తామన్నారు. ప్రతి శనివారం 100 మంది రైతులకు శిక్షణ తరగతులతో పాటు వారికి భోజన సౌకర్యం ఉంటుందన్నారు. రైతును వ్యాపారస్తుడిని చేయాలన్నదే ఆర్‌ఎం కిసాన్‌ ధ్యేయమని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్రికల్చర్‌, ఆర్టికల్చర్‌ సలహాదారులు తిరుపాల్‌రెడ్డి, సంబటూరు ప్రసాదురెడ్డి, ఏపీపీఎస్సీ బోర్డు మెంబర్‌ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, ద్వామా పీడీ యదుభూషన్‌రెడ్డి, రాష్ట్ర సివిల్‌ సప్లై డైరెక్టర్‌ గోపాల్‌రెడ్డి, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం ఏర్పాటే ప్రభుత్వ ధ్యేయం

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ఏర్పాటు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఎన్‌. పాలగిరిలో రూ.96లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్‌ విలేజ్‌ క్లీనిక్‌, పాలసేకరణ కేంద్రాలను ఆయన ప్రాంభించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను గ్రామస్థాయిలోనే అందించాలన్న సంకల్పంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాలు గతంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టలేదన్నారు. ఆర్టీసీ చైర్మన్‌ మల్లికార్జున్‌రెడ్డి, రాష్ట్ర ఆర్టికల్చర్‌, అగ్రికల్చర్‌ సలహాదారులు సంబటూరు ప్రసాదురెడ్డి, తిరుపాల్‌రెడ్డి, ఏపీపీఎస్సీ బోర్డు మెంబర్‌ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర సివిల్‌ సప్లై డైరెక్టర్‌ గోపాల్‌రెడ్డి, ద్వామా పీడీ యదుభూషన్‌రెడ్డి, కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి పాల్గొన్నారు.